క్లుప్తంగా

కమిషనర్‌కు ప్రశంసాపత్రం



కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న కమిషనర్

తాడిపత్రి రూరల్: జిల్లా కేంద్రంలోని రెవెన్యూ భవన్‌లో సోమవారం కమిషనర్ శివరామక్రిష్ణకు డీఆర్‌డీఏ, సెర్ప్ శాఖ తరపున ప్రశంసా పత్రాన్ని కలెక్టర్ వినోద్ కుమార్ అందచేశారు. సెప్టెంబరు నెల పింఛన్లను వేగవంతంగా పంపిణీ చేసి జిల్లాలో ప్రథమ స్థానంలో తాడిపత్రి మున్సిపాలిటీని నిలిపినందుకు ఆయనను కలెక్టర్ అభినందించారు.

దేశాభివృద్ధిలో ఎల్‌ఐసీ కీలక పాత్ర



మాట్లాడుతున్న జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా

గుంతకల్లు: దేశాభివృద్ధిలో జీవిత బీమా సంస్థ (ఎల్‌ఐసీ) కీలక పాత్ర పోషిస్తోందని గుంతకల్లు రైల్వే జిల్లా జీఆర్‌పీ ఎస్పీ రాహుల్ మీనా అన్నారు. సోమవారం స్థానిక ఎల్‌ఐసీ కార్యాలయంలో బీమా సంస్థ 68వ వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పాలసీదారులకు ఎల్‌ఐసీ అందిస్తున్న సేవలను కొనయాడారు. ఎల్‌ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్ మోహన్‌నాయక్ మాట్లాడుతూ బ్రాంచ్‌లో దాదాపు రూ.250 కోట్ల టర్నోవర్ ఉందన్నారు. అనంతరం సీనియర్ ఏజెంట్ నందీశ్వర్‌రెడ్డి, గుంతకల్లు బ్రాంచ్‌లో తొలి పాలసీదారుడిని సన్మానించారు. కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ ఈరేష్, అభివృద్ధి అధికారి తారేకేష్, శ్రీధర్, ఏజెంట్లు, పాలసీదారులు పాల్గొన్నారు.

ఎస్పీని కలసిన కమాండెంట్లు



ఎస్పీ జగదీష్‌కు మొక్క అందజేస్తున్న కమాండెంట్ ప్రభుకుమార్

అనంతపురం సెంట్రల్: నూతనంగా నియమితులైన 14వ బెటాలియన్ కమాండెంట్ ప్రభుకుమార్, కర్నూలు రేంజ్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్‌కుమార్ సోమవారం ఎస్పీ జగదీష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీని ఆయన చాంబర్‌లో కలిసిన వారు పూలమొక్కలు అందజేసి, మాట్లాడారు.

హోరాహోరీగా జిల్లా స్థాయి చదరంగం పోటీలు



గెలుపొందిన చెస్ క్రీడాకారులు

గుంతకల్లు: స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయి అండర్–19 చదరంగ పోటీలు హోరాహోరీగా సాగాయి. గుంతకల్లు, గుత్తి, అనంతపురం ప్రాంతాలకు చెందిన దాదాపు 83 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. అనంతపురానికి చెందిన గండికోట అనన్య, సాకేత్, ఆదిత్యరెడ్డి, స్టీఫెన్ తొలి నాలుగు స్థానాలను దక్కించుకున్నారు. 5, 6, 7వ స్థానాల్లో వేదదీప్, యువరాజ్‌కార్వా, కాసన్నగారి బాలాజీ నిలిచారు. వీరికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, చెస్ క్రీడాకారుడు అనిల్‌కుమార్, సీపీఐ నాయకులు ఎస్‌ఎండీ గౌస్, గోపీనాథ్, రామాంజనేయులు, మజీద్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల ధరలు తగ్గించాలి



తాడిపత్రిలో ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న నాయకులు

తాడిపత్రి రూరల్/శింగనమల/పుట్లూరు/బుక్కరాయసముద్రం: సామాన్యులకు పెను భారంగా ఉన్న నిత్యావసర ధరలను తగ్గించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తాడిపత్రి, శింగనమల, పుట్లూరు, బుక్కరాయసముద్రం తహసీల్దార్ కార్యాలయాల ఆవరణలో సోమవారం ఆందోళన చేపట్టారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలువుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం విఫలం చెందిందన్నారు. నిత్యావసర ధరలు తగ్గించాలని, అర్హులైన వారికి రేషన్, పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు.

చిరస్మరణీయుడు వైఎస్సార్

రైతు బాంధవుడు, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, నిరుపేదల పెన్నిధి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి భౌతికంగా లేకపోయినా ఆయన జ్ఞాపకాలు ఇంకా నిలిచే ఉన్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ , 108 వాహనాలు, జలయజ్ఞం ఇలా ఒక్కటేంటి ఎన్నో సంక్షేమ పథకాలతో ఆయన పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా ఆయన సేవలను ప్రజలు మరోసారి గుర్తు చేసుకుంటున్నారు. తాడిపత్రి, గుంతకల్లు, శింగనమల నియోజకవర్గాల్లో వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలతో హోరెత్తించారు. పలు గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాల వద్ద అన్నదానం చేశారు. అలాగే ఆస్పత్రుల్లో రోగులకు పాలు, బ్రెడ్డు పంపిణీ చేశారు.

- వాడవాడలా వైఎస్సార్ వర్ధంతి
- నివాళులర్పించిన పార్టీ శ్రేణులు, ప్రజలు



శింగనమలలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, వీరాంజనేయులు



గుంతకల్లులో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

తాడిపత్రి టౌన్: పేదల సంక్షేమానికి కట్టుబడి జనరంజక పాలన అందించిన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలచి ఉంటారని వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు అన్నారు. సోమవారం తాడిపత్రి పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ నాయకుడు ఫయాజ్ బాషా ఆధ్వర్యంలో విగ్రహానికి పెద్ద ఎత్తున పూలమాలలు వేసి, జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. ఆయనతోపాటు రాష్ట్ర మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలత మాట్లాడుతూ ఆరోగ్య శ్రీ, ఫీజురీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాల పేరు వింటే వైఎస్సార్ పేరు గుర్తుకు వస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు ఓబుళరెడ్డి, హనుమంతరెడ్డి, లక్ష్మీరంగయ్య, రాజశేఖర్‌రెడ్డి, రియాజ్, వేణు, శివారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, మున్నా బాబు, గడ్డం పరమేష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొణిదెల రమేష్ రెడ్డి పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్య క్రమంలో రఫీ, మహబూబ్ బాషా, లక్ష్మీనారాయణ, సాయికృష్ణారెడ్డి, , అప్రోచ్, బాబా, రాము, ప్రవీణ్ రెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండల కేంద్రం పెద్దవడుగూరు, ఎ.తిమ్మాపురం, రావులుడికి తదితర గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు హరికృష్ణారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, సచివాలయ మాజీ కన్వీనర్ శేఖర్, నారాయణరెడ్డి, బాబురెడ్డి, సురేంద్ర, ప్రసాద్‌రెడ్డి, పుల్లారెడ్డి, సుబ్బయ్య, శివన్న పలువురు కార్యకర్తలు, పాల్గొన్నారు.

యాడికి: వర్ధంతి సందర్భంగా మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, జెడ్పీ మాజీ సభ్యుడు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ చెన్నప్ప, నగరూరు సర్పంచు రుక్మాందరెడ్డి, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్, ఎంపీటీసీలు వెంకటనాయుడు, నాగరాజు, రామ్మోహన్, వార్డు మెంబర్లు తిరుపతి, పెద్దయ్య, మండల ఉప కన్వీనర్ జేసీ నారాయణ రెడ్డి, నాయకులు వెంకటరామిరెడ్డి , రామేశ్వర రెడ్డి, ఉమ్మడి రామాంజుల రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ శివప్రసాద్, కోట చౌదరి, బాలగంగయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే పెద్దపప్పూరు మండలంలోని వరదాయపల్లిలో ఎంపీపీ రామిరెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు.

వైఎస్సార్ మనసున్న మారాజు

గుంతకల్లుటౌన్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్. రాజశేఖరరెడ్డి మనసున్న మారాజు అని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్.భవాని వైస్ చైర్‌పర్సన్ నైరుతిరెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సోమవారం మెయిన్‌రోడ్డులోని మహానేత విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ వైఎస్సార్ అందించిన సంక్షేమ పథకాలు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు సుంకప్ప, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచులు, కోఆప్షన్‌సభ్యులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుత్తి: గుత్తి, గుత్తి ఆర్‌ఎస్‌లలో సోమవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ, మండల కన్వీనర్లు పీరా , గోవర్దన్ రెడ్డి, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు రంగస్వామి, సుభాష్‌రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు గురుప్రసాద్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

పామిడి: పామిడి, పాళ్యం గ్రామాల్లో దివంగత సీఎం వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎల్.మధుసూదన్‌రెడ్డి, పట్టణ, మండల రూరల్ కన్వీనర్లు జోజోడే కుమార్, కే నారాయణరెడ్డి, గుత్తి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి, నాయకులు బొట్టు రామచంద్ర, అనుంపల్లి సూరి, చీమల నగేష్, అన్వర్‌బాషా, రజాక్‌వలి, అబుసాలేహా, పార్వతీశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, శింగరప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ రాజశేఖరరెడ్డి కృషి మరువలేనిది

శింగనమల: బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన కృషి మరువలేనిదని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆలూరు సాంబశివారెడ్డి, వీరాంజనేయులు అన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని శింగనమలలో ఆయన విగ్రహనికి వైఎస్సార్‌సీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజలకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబశివారెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందించారన్నారు. ఆరోగ్యశ్రీ, విద్యార్థులకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్, ఇళ్ల నిర్మాణాలు, జలయజ్ఞం , రైతులకు రుణాలు మాఫీ, ఉచిత విద్యుత్ అందించి, ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలకృష్ణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ బొమ్మన శ్రీరామిరెడ్డి, వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచ్‌లు బొమ్మన గోపాలు రెడ్డి, వెంకట్రాముడు, ఆదినారాయణ, నాయకులు మిద్దె కుళ్లాయప్ప, పరంధామ రెడ్డి, నాగన్న, నవీన్ , ఎంపీటీసీలు మొరార్జీ, ఆలీ, నరసింహారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరసయ్య, బండి లలిత కళ్యాణి, ఎన్‌వీ నారాయణ, శ్రీనివాసులు నాయక్, గురుమూర్తి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో ముసలమ్మ కట్ట వద్ద వైఎస్సార్ సర్కిల్‌లో మహానేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశ పెట్టిన పథకాలు నేటికీ కొనసాగుతున్నాయన్నారు. అనంతరం సహకార సంఘం సొసైటీ కార్యాలయం ఎదుట మండల నాయకులు వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి వైఎస్సార్ సీపీ నాయకులు పూల నారాయణస్వామి, సాకే లక్ష్మీ నారాయణ, బూసీ, చంద్రమోహన్, ఆది, పూల రంగా, బయన్న, శివారెడ్డి, చెన్నకేశవ, రవి, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు: మండల కేంద్రంలో జెడ్పీటీసీ భోగతి విజయ ప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షులు పురుషోత్తంనాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. యల్లనూరు బస్టాండు ఆవరణలో ఉన్న వైయస్ రాజన్న కాంస్య విగ్రహానికి పూలమాలలలు వేసి నివాళిలర్పించారు. కార్యక్రమంలో నాయకులు హరిశ్చంద్రారెడ్డి, తిరుపాల్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, చేటప్ప, మూర్తి, దాసరి రమణ, శేఖర్, హనుమంతు, జాఫర్, హాజీవలి తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ విగ్రహాల వద్ద వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజలు ఘనంగా నివాళులర్పించారు. పుట్లూరు, కడవకల్లు, చెర్లోపల్లి, మడ్డిపల్లి, నాగిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగేశ్వరరావు, సర్పంచ్ బాబు, నాయకులు మహేష్, రవి, శివ, ఓబుశేషు, తిరుపాలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నె,కల్లూరు, తలగాచిపల్లి, తిమ్మంపేట, మర్తాడులో వైఎస్సార్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, ఎంపీపీ వెంకటనారాయణ, జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గట్టు రామక్రిష్ణారెడ్డి, వెంకటశివారెడ్డి, రామచంద్రారెడ్డి, బృందావన్ రామాంజనేయులు, బూదేడు సర్పంచు శివయ్య, రామాంజనేయులు, రాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



తాడిపత్రిలో వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మైనార్టీ నాయకుడు ఫయాజ్‌బాషా, రాష్ట్ర మహిళా కార్యదర్శి పేరం స్వర్ణలత



తాడిపత్రిలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న రమేష్ రెడ్డి



బీకేఎస్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆలూరు సాంబశివారెడ్డి



పెద్దవడుగూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



యాడికిలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు, కార్యకర్తలు



పెద్దపప్పూరులో వైఎస్సార్‌కు ఘన నివాళులర్పిస్తున్న ఎంపీపీ రామిరెడ్డి



గుత్తి ఆర్‌ఎస్‌లో నివాళులర్పిస్తున్న పార్టీ శ్రేణులు



పామిడిలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



గార్లదిన్నెలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



యల్లనూరులో రాజన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న జెడ్పీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి



పుట్లూరులో వైఎస్సార్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

'వినాయక చవితి' ప్రశాంతంగా నిర్వహించుకోండి

తాడిపత్రి అర్బన్: పోలీసుల సూచనలు పాటిస్తూ, ప్రశాంత వాతావరణంలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించుకోవాలని డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు సూచించారు. సోమవారం అర్బన్ పోలీస్‌స్టేషన్‌లోని కాన్ఫరెన్స్ హాలులో అర్బన్ పరిధిలోని ఉత్సవ కమిటీలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలనుకునే వారు ముందుగా సమాచారాన్ని పోలీసులకు అందించాలన్నారు. విగ్రహాలను ఏర్పాటు చేసే క్రమంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. విగ్రహాల వద్ద భద్రత బాధ్యత నిర్వాహకులదేనన్నారు. విగ్రహాల వద్ద అశ్లీల నృత్యాలను ప్రదర్శించకూడదన్నారు. విద్యుత్తు సరఫరాలకు, మైక్ ఏర్పాటుకు తగిన రుసుం చలానా రూపంలో చెల్లించి అనుమంతి పొందాలన్నారు. ఉత్సవాలకు సంబంధించి ప్రభుత్వం నూతన విధానాన్ని తీసుకొచ్చిందని 7995095800 నెంబర్‌కు వాట్సాప్‌లో హాయ్ అనే టైప్ చేసి పంపితే వెంటనే ఆయా ప్రాంతాల్లోని వినాయక మండపాల వివరాలను పొందుపరుస్తామన్నారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ పి.సాయిప్రసాద్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు

అనుమతి తప్పనిసరి

యల్లనూరు: వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలనుకుంటున్న వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని సీఐ సుబ్రహ్మణ్యం సోమవారం తెలిపారు. అనుమతి లేకుండా విగ్రహాలనుస్పేటు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

తెగుళ్ల నివారణకు మెలకువలు అవసరం

బుక్కరాయసముద్రం/యాడికి: పంట పొలాల్లో తెగుళ్ల నివారణకు మెలుకువలు ఎంతో అవసరమని రేకులకుంట శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మి కళ్యాణి, రెడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం పెద్దపప్పూరు మండలంలోని కుమ్మెత, తిమ్మన చెరువు, పసలూరు, జూటూరు, ఉల్లికల్లు, తాడిపత్రి రూరల్ మండలంలోని కనగానిపల్లి, దిగువపల్లి గ్రామాల్లో పత్తి, మొక్క జొన్న, వేరుశెనగ, ఆముదం, పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. వారు మాట్లాడుతూ బంగాళా ఖాతంలో ఏర్పడిన వాయుగుండం నేపథ్యంలో పంటల తెగుళ్లపై కూడా వాటి ప్రభావం చూపుతుందన్నారు. పత్తి పంట సాగులో పూత, కాయ కుళ్లు గుర్తించడం జరిగిందన్నారు. వీటికి ఎకరాకు 20 కేజీల యూరియా, 10 కేజీల పొటాష్ వేయడం వలన సాధారణ స్థితికి వస్తుందన్నారు. పూత రాలడం నివారణకు 200 లీటర్ల నీటికి 400 గ్రాముల బోరాన్, 40 ఎంఎల్ ప్లానోఫిక్స్ మందు కలిపి స్ప్రేయింగ్ చేయాలన్నారు. గులాబీ రంగు పురుగు నివారణకు పురుగు మందు కాకుండా లింగాకర్షణ బుట్టలు ఎకరాకు 20 చొప్పున అమర్చు కోవాలన్నారు. కార్యక్రమంలో పెద్ద పప్పూరు మండల వ్యవసాయ అధికారి ఆంజినేయులు, రైతులు పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న శాస్త్రవేత్తలు

పర్యాటకాభివృద్ధికి చర్యలు

అనంతపురం కల్చరల్: జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు తీసుకున్నట్లు పురావస్తు శాఖ, పర్యాటక శాఖ అధికారులు తెలిపారు. పర్యాటక అభివృద్ధిపై ఎండోమెంట్, మ్యూజియమ్, పర్యాటక శాఖ అధికారులతో సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్ సమీక్షించారు. డిస్ట్రిక్ట్ టూరిజం కౌన్సిల్ (డీటీసీ)ని ఏర్పాటు చేసి అందులో అధికారులను సభ్యులుగా చేర్చాలని తీర్మానించారు. ఇందులో భాగంగా కసాపురం, పెన్నహోబిలం, ఆలూరు కోన, బూదగవి, కంబదూరులోని ఆలయాలను కలుపుతూ రిలీజియస్ సర్క్యూట్‌ను ఏర్పాటు చేయనున్నారు. అలాగే హెరిటేజ్ సర్క్యూట్‌లో రాయదుర్గం కోట, రససిద్ధుల గుట్ట, పీస్ మెమోరియల్ హాలు, టవర్‌క్లాక్‌ను చేర్చారు. ఎకో సర్క్యూట్ పరిధిలో పీఏబీఆర్, జీడిపల్లి రిజర్వాయర్, అనంత సాగరం చెరువు, శింగనమల చెరువు, పంపనూరు పార్కు, ఆలూరు కోన వాటర్ ఫాల్స్ ఉన్నాయి. వీటిన్నింటినీ కలుపుతూ గుత్తి, తాడిపత్రి, అనంతపురం, కళ్యాణదుర్గం జోన్లుగా విభజించి అందరి సహకారంతో ప్రతి పర్యాటక క్షేత్రం వద్ద ఆయా విశిష్టతను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని తీర్మానించారు.

భగవద్గీత శ్లోకాలపై నేడు పోటీలు

గుత్తి: పట్టణంలోని కోర్టు రోడ్డులో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ మందిరంలో మంగళవారం భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించనున్నట్లు ప్రబోధ సేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక అధ్యక్షుడు రవి కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాత్రి ఏడు గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. 10వ తరగతిలోపు విద్యార్థులు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

గుత్తి: పట్టణంలోని బండగేరికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు ఆర్‌బీ కమలాకర్(48) సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనకు భార్య కృష్ణవేణి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం బండగేరికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గౌతమి సూచించారు. సోమవారం మండలంని ఇల్లూరులో వైద్యశిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా 132 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారులు మద్దయ్య, నూర్ బాషా, శ్రీధర్, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, కృష్ణ మోహన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

యాడికి: మండలంలోని లక్షుంపల్లి కొండల్లోని నాటుసారా స్థావరాలపై సీఐ ఈరన్న తన సిబ్బందితో సోమవారం దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీదారులు పోలీసులను చూసి పారిపోయారు. ఈ సందర్భంగా 500 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేసి, 10 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని సీఐ ఈరన్న తెలిపారు. కార్యక్రమంలో పోలీసులు పవన్ కుమార్ రెడ్డి, పెద్దన్న, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

గార్లదిన్నె: మండలంలోని రామ్‌దాస్ పేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాలు మేరకు.. నార్పల మండలం సూల్తాన్ పేటకు చెందిన రాజశేఖర్ (26) అనే యువకుడు పామిడి నుంచి అనంతపురం వైపు ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. రామ్‌దాస్‌పేట సమీపంలో ద్విచ క్రవాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన పడడంతో రాజశేఖర్ కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పౌష్టికాహారంతోనే తల్లీబిడ్డ ఆరోగ్యం

గుంతకల్లు రూరల్/తాడిపత్రి రూరల్/యల్లనూరు/పెద్దవడుగూరు/యాడికి: పౌష్టికాహారం క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని తహసీల్దార్ రమాదేవి సూచించారు. సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకూ పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో తహసీల్దార్ రమాదేవి ఐసీడీఎస్ సిబ్బంది, వివిధ శాఖల అధికారులతో కలసి కార్యక్రమ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదల సక్రమంగా ఉండాలంటే తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అదేవిధంగా గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. అలాగే తాడిపత్రి పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో సూపర్‌వైజర్ విజయకుమారి ఆధ్వర్యంలో పౌష్టికాహార వారోత్సవాలు నిర్వహించారు. అదేవిధంగా యల్లనూరు, పెద్దవడుగూరు, పెద్దపప్పూరు మండలాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు.